BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 23 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## యూపీఎస్సీ సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో




యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష 2025 తోపాటు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ప్రిలిమ్స్) పరీక్ష నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు బుధవారం నుంచే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 11 వరకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుంది. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ఈ ఏడాది మే 25న జరగనుంది. అయితే ఈసారి అన్ని సర్వీసులకు కేవలం 979 ఖాళీలను మాత్రమే యూపీఎస్సీ భర్తీ చేయనుంది. గత ఏడాది భర్తీ చేసిన 1056 పోస్టులతో పోల్చితే ఇప్పుడు 77 పోస్టులు తక్కువగా ఉన్నాయి. అయితే సివిల్ సర్వీసెస్‌తోపాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో కూడా 150 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు నోటిఫికేషన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్ https://upsc.gov.in/ ద్వారా తెలుసుకోవచ్చు.

# ప్రయాణికులపైకి దూసుకెళ్లిన రైలు



- 12 మంది మృతి.. 40 మందికి గాయాలు
- పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు వ్యాపించినట్లు వదంతులు
- ప్రయాణికులు భయంతో చైన్‌లాగి బోగి నుంచి దిగి పట్టాలు దాటుతుండగా ఢీకొట్టిన కర్నాటక ఎక్స్‌ప్రెస్


బలగం టీవీ,ముంబై

మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికుల మీద నుంచి మరో రైలు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మ మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని పలు ఆస్పత్రులకు అంబులెన్స్‌ల్లో తరలించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

బుధ వారం సాయంత్రం 5గంటల సమయంలో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు వ్యాపించి నట్టు వదంతులొచ్చాయి. దీంతో భయంతో ప్రయాణికులు ఆ రైలు చైన్‌లాగి పట్టాలపై దిగారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా పచోరా రైల్వే స్టేషన్ సమీపంలో కర్నాటక ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి వారిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై తమకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్‌లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగాయని ఓ అధికారి చెప్పారు. భయాందోళనకు గురైన ప్రయాణికులు చైన్ లాగారని తెలిపారు. కొందరు ట్రాక్‌లపై దూకేసిన సమయంలో అటుగా వచ్చిన కర్నాటక ఎక్స్‌ప్రెస్ వీరిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు వివరించారు.

ఈ ఘటనపై సెంట్రల్ రైల్వే అధికారులు స్పందించారు. "ప్రయాణికులు చైన్ లాగడంతో లక్నో–ముంబయి (పుష్పక్ ఎక్స్‌ప్రెస్) రైలు ఆగింది. ఈ ట్రైన్ ఆగాక ఒక బోగీ నుంచి కొందరు ప్రయాణికులు దిగి మరో ట్రాక్‌పైకి వెళ్తున్న క్రమంలో అటుగా వస్తున్న బెంగళూరు – ఢిల్లీ (కర్నాటక ఎక్స్‌ప్రెస్) రైలు ప్రయాణికుల్ని ఢీకొట్టింది. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించేందుకు అంబులెన్సులు పంపాం. ఘటనా స్థలికి విపత్తు సహాయక రైలు బయల్దేరింది" అని తెలిపారు.

రైలు ప్రమాద ఘటనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు చేశారు.




దావోస్ వేదికగా రికార్డు

# రాష్ట్రానికి రూ.45,500 కోట్ల పెట్టుబడులు

- భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పాటు
- ముందుకొచ్చిన సన్ పెట్రో కెమికల్స్ సంస్థ
- నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులు
- పాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7000 ఉద్యోగాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై మరో కొత్త రికార్డు నమోదు చేసింది. రాష్ట్రానికి గతంలో ఎన్నడూ లేనంత భారీ పెట్టుబడులను సమీకరించింది. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సంస్థ సన్ పెట్రో కెమికల్స్ తెలంగాణలో రూ.45500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు సన్ పెట్రో కెమికల్స్ సంస్థ ప్రకటించింది. ముఖ్యమంత్రి గారు, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీ గారితో చర్చలు జరిపిన అనంతరం వారి సమక్షంలోనే అధికారులు అవగాహన ఒప్పందంపై (ఎంవోయూ) సంతకాలు చేశారు.

నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3400 మెగావాట్లు. వీటికి 5440 మెగావాట్ల సామర్థ్యముండే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావటం విశేషం. భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చిన సన్ పెట్రో కెమికల్స్ ప్రతినిధులను ముఖ్యమంత్రి గారు అభినందించారు. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించే తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలు రాయిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు.

హరిత ఇంధన ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని, సన్ పెట్రో కెమికల్స్ భాగస్వామ్యంతో భవిష్యత్తులో డిమాండ్ కు అనుగుణంగా ఇంధన వనరులు సమకూరుతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలతో పాటు నాగర్కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయని అన్నారు. తమ ప్రభుత్వం జరిపిన సంప్రదింపులు, తమ చర్చలు ఫలించాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇంత భారీ పెట్టుబడుల ఒప్పందం సాధించటం ఆనందంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు గారు అన్నారు. తాము చేపట్టబోయే ప్రాజెక్టు తెలంగాణలోనే కాకుండా దేశంలోనే అత్యంత ప్రభావవంతంగా ఉంటుందని సన్ పెట్రో కెమికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ సాంఘ్వీ గారు ధీమా వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో తెలంగాణ పెట్టుబడుల గమ్య స్థానంగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం గర్వంగా ఉందన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి సహకరించండి




- హైదరాబాద్ ను అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని
- తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఫ్యూచర్ సిటీ
- హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ పై ప్రత్యేక దృష్టి : సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని అన్నారు.

"తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని అందరినీ ఆహ్వానిస్తున్నాం. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది మా ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుంది. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. పర్యావరణహితంగా హైదరాబాద్ ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేది మా అభిమతం. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశాలు హైదరాబాద్లో ఉండాలని కోరుకుంటున్నాం. ఎలక్ట్రిక్ వెహికిల్స్ పై మేము ప్రత్యేక దృష్టిని సారించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశాం. భారత దేశంలోనే ఈవీ వాహనాలు అత్యధికంగా అమ్ముడుపోయే రాష్ట్రం తెలంగాణ. మొబిలిటీ ఒక్కటే అన్నింటికీ పరిష్కారం కాదు. ఇప్పుడున్న పరిస్థితులను పర్యావరణ అనుకూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. అందుకే గ్రేటర్ హైదరాబాద్ సిటీలో ప్రజా రవాణా వ్యవస్థలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నాం.

తెలంగాణ డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌజ్ హబ్ గా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తాం. నగరాల అభివృద్ధికి, వాటి భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ భవిష్యత్తుకు పునాది. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయి. హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉంది. దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నాం. ఇప్పుడున్న దానికంటే ఇది రెండింతలు ఎక్కువ. నేను నా బృందంతో కలిసి జ్యూరిచ్ నుంచి దావోస్ కు రైలులో ప్రయాణించాం. అదొక అందమైన అనుభూతిని కలిగించే ప్రయాణం. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ మేరకు ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నాం. ఆ రెండు రింగ్ రోడ్లను కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మిస్తాం. రింగ్ రోడ్లకు అనుబంధంగా రింగ్ రైల్వే లైను నిర్మించాలనే ఆలోచనలున్నాయి. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అర్బన్ మొబిలిటీపై నా అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఇచ్చినందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ కు కృతజ్ఞతలు." అని సీఎం గారు తెలిపారు.

# గ్రామసభల్లో ప్రజలు మర్లబడుతున్నారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్ అధ్యయన కమిటీ సమావేశానికి హాజరు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గ్రామసభల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం అవుతుందని గ్రామసభల్లో ప్రజలు మర్లబడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఇవాళ ఆగ్రహంతో టెంట్లను కూలగొట్టినట్టే.. రేపు ఏదో దశలో ఈ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తారని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మన్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన మంచిరేవులలోని ఆయన నివాసంలో ఈ సమావేశం జరగ్గా కేటీఆర్ హాజరయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

నల్లగొండలో బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు ఈ నెల 28న అనుమతి ఇచ్చింది. అయితే ఈ రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తున్నది.. నిరసన చెప్పొచ్చు అని సీఎం రేవంత్ రెడ్డి చాలా సార్లు చెప్పారు. మా చిన్న ధర్నాకే ఆగమాగం అయిపోయి.. చివరికి అనుమతి నిరాకరించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రాజ్‌భవన్ ముందు ధర్నా చేయొచ్చుట. వందలాది వాహనాలు తిరిగే బిజీ రోడ్డు రాజ్‌భవన్ రోడ్డు.. అక్కడ సీఎం, మంత్రులు ధర్నా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది కాదంట. కానీ మేం నల్లగొండ క్లాక్ టవర్ వద్ద ధర్నా చేస్తే.. ట్రాఫిక్ స్తంభించి పోతుందట. అది అంతర్జాతీయ రహదారి అయినట్టు రాష్ట్రాల మధ్య రాకపోకలు దెబ్బతినే విధంగా ఉందని రిపోర్టు ఇచ్చి నిరాకరించారు. చివరకు హైకోర్టు న్యాయం చేసింది. రైతు మహాధర్నాకు అనుమతి ఇచ్చినందుకు హైకోర్టుకు ధన్యవాదాలు. కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుని రైతుల ఆవేదన, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కేటీఆర్ తెలిపారు.ఒక అబద్దాన్ని నిజం చేయడానికి వందసార్లు చెప్తే నిజం అవుతుందనే అపోహలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. మేం మీలాగా రేషన్ కార్డు ఇచ్చేందుకు హడావుడి చేయలేదు. పబ్లిషిటి చేయాలనే పిచ్చి కాంగ్రెసోళ్లకు ఉంది. మా ప్రభుత్వ హయాంలో 6 లక్షల 47 వేల పైచిలుకు రేషన్ కార్డులు ఇచ్చాం. ఏనాడూ కూడా పబ్లిషిటి చేయలేదు. మీ సేవ ద్వారా లబ్దిదారులు దరఖాస్తు చేసుకుంటే ఇచ్చాం. కానీ మేం అసలు రేషన్ కార్డులు ఇవ్వన్నట్టు కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.


గ్రామసభల్లో ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద సమాధానాలు ఉన్నాయా? ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతుబంధు గురించి ప్రజలు అడుగుతున్నారు. వీటికి సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం వద్ద సత్తా లేదు. అధికారంలోకి రాగానే ప్రజా పాలన పేరిట కోటి 6 లక్షల దరఖాస్తులు తీసుకున్నారు. రేషన్ కార్డు, రైత భరోసా కోసం దరఖాస్తులు తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఎందుకు తీసుకుంటున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎవరి తప్పు ఇది.. ఆ దరఖాస్తులు ఎక్కడ..? ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. ప్రభుత్వం పరిపాలనలో నిమగ్నం కావాలి.. ఇతర కార్యక్రమాలు బంద్ చేయాలి. ప్రజలకు మేలు చేసే విధంగా పని చేస్తే నిరసనలు తప్పుతాయి. లేదంటే నిరసనలు తప్పవు.

## పలు చోట్ల గ్రామ సభలు రసాభాస

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గ్రామసభలు రసాభాసగా మారుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పిట్టలవాడలో నిర్వహించిన వార్డు సభలో కాలనీ వాసులు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు రాలేదన్నారు. మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో ఇప్పటికే మూడు సార్లు చేశామన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అర్హుల ఎంపికపై గ్రామ ప్రజలు అధికారులను నిలదీశారు. పోలీసుల జోక్యంతో కొంత అదుపులోనికి వచ్చినా గ్రామసభ అర్ధాంతరంగా నిలిచిపోయింది.చింతకాని మండలం నాగిలిగొండ గ్రామ పంచాయతీ కార్మికుడు పి.శ్రీను.. తన పేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో లేదని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు నచ్చజెప్పి కిందకు దించారు. గుండ్రాతిమడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని గ్రామసభ టెంట్ కూల్చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక సభ రసాభాసగా సాగింది. అశ్వారావుపేట మండలం నందిపాడు, ఆసుపాకల్లోనూ నిరసన వ్యక్తమైంది. అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు సభలో గందరగోళం నెలకొంది. అభివృద్ధి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం సాగింది. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(బి) గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లు లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట పట్టణం గాడిచర్లపల్లి 15వ వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడంతోపాటు వారి ఆవేదన విన్నారు.




## ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దావోస్‌లో ఒకే వేదికపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కనిపించారు. 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' సమావేశంలో ఈ ముగ్గురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. రాష్ట్రాల అభివృద్ధి–సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి.

రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, అలాగే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో వేదికను పంచుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. న్యూయార్క్, టోక్యో లాంటి నగరాల స్థాయికి హైదరాబాద్ రాజధానిగా ఉన్న తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడుతుంది. అభివృద్ధి బాటలో నడవడానికి తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో సుహృద్భావ సంబంధాలను కొనసాగిస్తుంది. చంద్రబాబు, రాజశేఖర రెడ్డి రాష్ట్రాన్ని, ముఖ్యంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన తీరు అసాధారణం" అని కొనియాడారు.

# పేదల జోలికి వస్తే చీల్చి చెండాడుతాం

- నేను ఎవరినీ కొట్టాలని అనుకోలేదు
- పేదల బాధ చూసి ఆవేశం వచ్చింది
- ఎంపీ ఈటల రాజేందర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పేదల జోలికి వచ్చినా, మహిళలను ఇబ్బంది పెట్టినా చీల్చి చెండాడుతాం అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సీఎం కార్యాలయం నుంచి భూ మార్పిడి జరుగుతుందని ఆరోపించారు. మంగళవారం ఓ వ్యక్తిపై ఈటల రాజేందర్, ఆయన అనుచరులు దాడి చేశారు. ఈ ఘటనలో ఈటలపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టైగర్ నరేంద్ర, బద్దం బాల్ రెడ్డి, బండారు దత్తాత్రేయ వరకు పేదలకి అండగా నిలిచిన పార్టీ బీజేపీ అన్నారు. రేవంత్ సర్కారు రావడంతోనే హైడ్రా పేరుతో పేదలపై విరుచుకుపడింది. హైడ్రా, మూసి బాధితులకు బీజేపీ అండగా నిలబడింది. రియల్టర్ల పేరుతో దౌర్జన్యానికి దిగుతున్నారని సీపీ దృష్టికి తీసుకెళ్లాం కానీ ఫలితం లేదు. కలెక్టర్, సీపీకి సమస్య వివరించినా పరిష్కారం దొరకలేదు. కబ్జా చేసి పహిల్వాన్‌లను పెట్టి స్థానికులను, మహిళలను బెదిరించారు. ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందో వారి దౌర్జన్యాలు చూస్తే అర్థం అవుతుంది. నేను ఎవరిని కొట్టాలని అనుకోలేదు. కానీ వ్యవస్థ విఫలమైంది. పేదల బాధ చూసి ఆవేశం వచ్చింది. పేదల జోలికి వచ్చినా, మహిళలను ఇబ్బంది పెట్టినా చీల్చి చెండాడుతాం. 2005లో ఏకశిలా నగర్ రాజు, వెంకటేష్, భాస్కర్ అనే ముగ్గురు ప్లాట్లను కొన్నట్టు దొంగ డాక్యుమెంట్లు సృష్టించారు. వాటితో లోన్లుకూడా తీసుకున్నారు. అయితే 2010లో బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన కోర్టు సైతం బాధితులకు అనుకూలంగా తీర్పిచ్చింది. హర్ష కన్‌స్ట్రక్షన్ కంపెనీ వెంకటేష్ ప్లాట్ల ఓనర్లను ఇంకా భయపెడుతున్నారు. ధరణి లోసుగులతో ఇష్టారీతిన ల్యాండ్‌లు మార్చుకున్నారు.

అధికారులు కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బాసుల మెప్పు కోసం కాదు పేదలకు న్యాయం చేసేలా అధికారులు పని చేయాలి. అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తే డీవోపీటీకి ఫిర్యాదు చేస్తాం. నాడు, నేడు సీఎంల కార్యాలయాల్లోనే ఈ ల్యాండ్ మార్పిడులు జరుగుతున్నాయి. కాళేశ్వరం కాదు అంతకంటే ఎక్కువ కోట్ల అవినీతి ఈ ల్యాండ్ దందాలలో జరిగింది. కేసులకు భయపడను. తెలంగాణ ఉద్యమంలో 150 కేసులు ఉన్నాయి. ఇప్పుడు 156 అవుతాయి' అని అన్నారు.

# ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి..

- ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలి..
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆటోలకు అభయ క్యూఆర్ కోడ్,డ్రైవర్లుకు ప్రమాద భీమా పత్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలకు అనునిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తారని వారి రక్షణ దృష్ట్యా జిల్లాలో మొదట దశలో 4000 ప్యాసింజర్ వాహనాలకు అభయ యాప్ "మై ఆటో ఇస్ సేఫ్ అనే క్యూఆర్ కోడ్ అనుసంధానం చేయడంతో పాటు మరియు ప్రమాద భీమా అందించడం జరిగిందని అన్నారు.రెండవ దశలో జిల్లాలో కొత్తగా 800 వాహనాలకు క్యూఆర్ కోడ్ అనుసంధానం చేయడంతో పాటుగా అభయ యాప్ తో వాహనాల డ్రైవర్లకు 50 రూపాయలతో యాక్సిడెంట్ డెత్ కు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ వచ్చేలా ఒక సంస్థతో అనుసంధానం చేసి ప్రమాద భీమా పత్రాలు అందించడం జరిగిందని దీనిని ప్రతి సంవత్సరం 50 రూపాయలతో రిన్యువల్ చేసుకోవాలన్నారు.

ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆసురక్షితంగా భావించే ఏదైనా పరిస్థితిని సంఘటనలను ఎదుర్కొన్నపుడు ఆటోకి ముద్రించిన "క్యూ అర్ కోడ్"ను స్కాన్ చేయాలని స్కాన్ చేయగానే వెంటనే డ్రైవర్ ఫోటో,వివరాలతో పాటుగా వాహనంకి సంబంధించిన వివరాలు వస్తాయని అన్నారు. స్కాన్ చేసిన వ్యక్తి ఫోన్ నెంబర్ యాప్ లో ఎంట్రీ చేసి ట్రేస్ ద లొకేషన్ అని ఎంట్రీ చేయగానే వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్, ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు.ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది ఆటోలో ఎక్కినప్పటి నుండి దిగేంతవరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా మానిటర్ చేయడం జరుగుతుందని, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని తగు రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ఆటోలో ఎక్కిన మహిళలు ప్యాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలి ఆటో డ్రైవర్ వివరాలు నెంబర్ తో యుక్తంగా వస్తాయి ఆటోలో ఏదైనా విలువైన వస్తువులు మరిచిపోతే వెంటనే ఆటోను ట్రేస్ అవుట్ చేసి అప్పగించడానికి వీలుంటుందని అన్నారు.గతంలో ఆటో డ్రైవర్ ఏదైనా పోలీస్ కేసులో ఇన్వాల్వ్మెంట్ అయి ఉంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే థిస్ ఆటో నాట్ సేఫ్ అనే రెడ్ సిగ్నల్ వస్తుంది ఇది ప్రయాణికులకు సేఫ్ జర్నీ చేయడానికి చాలా ఉపయోగపడుతుందని అన్నారు.ఆటో డ్రైవర్లు ఏదైనా నేరాలకు పాల్పడిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన సిసి కెమెరాల ద్వారా కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు ని అన్నారు.

ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ,ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,హిట్ అండ్ రన్ చేసిన ఈ అప్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చు.అదేవిదంగా ప్రయాణికులు వారు ప్రయాణిస్తున్న వాహనం కి రేటింగ్ కూడా ఇవ్వవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సి.ఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ లు రాజు, రమేష్, అభయ యాప్ సృష్టి కర్త అభిచరన్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మూసీని ఏటీఎంగా మార్చాలని చూస్తున్న కాంగ్రెస్



**బలగం టీవీ , యాదాద్రి**

- ఎమ్మెల్సీ కవిత

మూసీని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చాలని చూస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. యాదాద్రి భోనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు గుర్తించాలని సూచించారు. పారిశ్రామిక వ్యర్థాలు మూసిలో కలుస్తుంటే 60 ఏళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసింది? అని నిలదీశారు. మూసి నదిని ప్రక్షాళించడానికి కేసీఆర్ సంకల్పించారన్నారు. అందులో భాగంగానే ఎస్టీపీలను ఏర్పాటు చేయడమే కాకుండా.. గోదావరి నదితో అనుసంధానం చేయాలనుకున్నారన్నారు. మూసిలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మూసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారన్నారు. మూసిని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చాలని చూస్తున్నారన్నారు. హైదరాబాదుకు దగ్గరలో ఉన్న కొండపోచమ్మ సాగర్‌ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసి – గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు.రూ.7500 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. కొండపోచమ్మ నుంచి మూసి అన్నసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పుడు ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకు? అంటూ ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసి ప్రక్షాళన పేరిట పేద ప్రజల ఇళ్లను కూల్చివేత కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందన్నారు. పేద ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం .. మూసి ప్రక్షాళనకు అయ్యే వ్యయం రూ.50 వేల కోట్లు అని ఒకసారి, రూ.లక్ష కోట్లు అని మరొకసారి, లక్షన్నర కోట్లు అని ఇంకోసారి సీఎం చెబుతున్నారన్నారు.

మూసిని ఏటీఎంగా మార్చుకొని.. వచ్చే డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక సీఎం వేసుకున్నారని విమర్శించారు. యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని పారద్రోలేందుకు కేసీఆర్ సంకల్పించారన్నారు. అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారన్నారు. ఫ్లోరైడ్‌ని నిర్మూలించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అనేక సంవత్సరాలు రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఒక వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన పోలేదని విమర్శించారు. 60లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బీఆర్ఎస్ పార్టీ అని.. కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి ఉండదు.. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరని స్పష్టం చేశారు. రౌడీ మూకలను వేసుకొని పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాదని.. మాటలతో, విజ్ఞతతో, నిబద్ధతతో ప్రజల కోసం పోరాటం చేసే సంస్కృతి బీఆర్ఎస్‌దన్నారు.

### గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

గిరి ప్రదక్షిణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహించిన గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం కవిత మాట్లాడారు. తెలంగాణ ప్రజల కొంగుబంగారంగా యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ మహాఅద్భుతంగా నిర్మించారని గుర్తు చేశారు. యాదాద్రిని టెంపుల్ సిటీ ఆఫ్ వరల్డ్‌గా నిలబెట్టుకున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

# 28న నల్లగొండలో బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి

**బలగం టీవీ , హైదరాబాద్**

నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నెల 28న నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు ధర్నా నిర్వహించేందుకు కోర్టుగ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, పలువురు నాయకులు హాజరు కానున్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి జిల్లా నాయకులు ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ, జిల్లాలో గ్రామ సభలు, సంక్రాంతి రద్దీ కారణంగా బందోబస్తు ఇవ్వలేమంటూ జిల్లా పోలీసులు ధర్నాకు అనుమతి నిరాకరించారు. దాంతో బీఆర్ఎస్ నాయకులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు.. బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కూల్చివేతలను అడ్డుకున్న ఎమ్మెల్యే

**బలగం టీవీ , హైదరాబాద్**

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చింతల్ బస్తీలో అధికారులు కూల్చివేతలు చేపడుతుండగా ఎమ్మెల్యే దానం నాగేందర్ వారిని అడ్డుకున్నారు. తన అనుమతి లేకుండా ఎలా కూల్చివేస్తారంటూ అధికారులపై మండిపడ్డారు.వివరాల్లోకెళ్తే.. బల్దియా, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ఖైరతాబాద్‌లోని షాదాన్ కాలేజీ ఎదురుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేతలు చేపట్టారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే దానం నాగేందర్ అక్కడకు చేరుకున్నారు. కూల్చివేతలను వెంటనే ఆపాలని అధికారులను కోరారు. తాను స్థానిక ఎమ్మెల్యేనని, తనకు సమాచారం ఇవ్వకుండా కూల్చి వేతలు ఎలా చేపడతారని ప్రశ్నించారు. పేదవారిపై దౌర్జన్యం ఏమిటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో ఉన్నారని, ఆయన వచ్చే వరకు కూల్చివేతలు ఆపాలన్నారు. కూల్చివేతలు ఆపకుంటే మాత్రం ఆందోళన చేస్తానని హెచ్చరించారు.

# గ్రామ సభల్లో గొడవలు బీఆర్ఎస్ చేయించినవే

- మంత్రి సీతక్క

**బలగం టీవీ , హైదరాబాద్**



గ్రామ సభలలో గొడవలు చేయిస్తున్నది బీఆర్ఎస్ పార్టీ యే నంటూ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు.హైదరాబాద్ లో ఆమె నేడు మీడియాతో మాట్లాడుతూ మంగళవారం మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని.. కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని స్వయంగా బీఆర్ఎస్ పత్రికలోనే చెప్పారన్నారు. అంటే కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగిందని, అది కూడా బీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. అంటే 96 శాతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు జరిగినట్టు స్పష్టమవుతుందన్నారు. గతంలో ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా లబ్ధిదారులను గుర్తిస్తుంటే కావాలని బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటిటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు.

# హన్మకొండలో పట్టపగలే దారుణ హత్య..

**బలగం టీవీ , హైదరాబాద్**

వరంగల్ నగరంలోని హన్మకొండలో దారుణం చోటు చేసుకుంది. పట్టపగలు అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తిని మరో వ్యక్తి కిరాతకంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.అలాగే దుండగుడి చేతిలో హత్యకు గురైన వ్యక్తిని మడికొండకు చెందిన రాజ్ కుమార్ గా పోలీసులు గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అలాగే ఘనటపై స్థానికులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని, ప్రత్యక్ష సాక్షులు, సీసీటీవీ ఫుటేజ్, కొన్ని ఆధారాలతో నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ప్రజాతిరుగుబాటు మొదలైంది : కేటీఆర్

**బలగం టీవీ , హైదరాబాద్**

మోసకారి కాంగ్రెస్ సర్కారుపై ప్రజాతిరుగుబాటు మొదలైందని.. గ్యారెంటీల గారడీపై జనగర్జన షురూ అయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అసమర్థ ముఖ్యమంత్రి.. అసలు స్వరూపం బట్టబయలైందన్నారు. ఇక కాలయాపనతో కాలం సాగదని.. అటెన్షన్ డైవర్షన్ ఏమాత్రం చెల్లదన్నారు. ఈ దరఖాస్తుల దందా నడవదని, ఈ ఆగ్రహ జ్వాల ఇక ఆగదని హెచ్చరించారు. నమ్మించి చేసిన నయవంచనకు నాలుగుకోట్ల సమాజం ఊరుకోదన్నారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు గ్రామసభలు అట్టుడికాయన్నారు. గ్రామసభలా.. ఖాకీల క్యాంప్ లా? అంటూ ప్రశ్నించారు. సంక్షేమ పథకాల కోసమా..? కాంగ్రెస్ కార్యకర్తల నిర్ధారణ కోసమా అన్నారు. ఖాకీల దౌర్జన్యాలు, కాంగ్రెస్ నేతల బెదిరింపులతో గ్రామ సభలు జరుగుతున్నాయన్నారు. పోలీసు పహారాలో గ్రామలను నింపేసి గ్రామసభలా? ప్రశ్నించిన ప్రజలపై ఖాకీల జులుమే సమాధానమా? అంటూ నిలదీశారు. ఇదా.. మీరు చెప్పిన ప్రజా పాలనా? ఇదా.. మీరు చెప్పిన ఇందిరమ్మ పాలనా? ప్రశ్నించారు. పోలీసుల నడుమ.. అంక్షల నడుమ..పథకాలకు అర్హుల గుర్తింపట! అంటూ నిలదీశారు. నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గేంటి అన్నట్లు కాంగ్రెస్ పాలన సాగుతుందంటూ పేర్కొన్నారు.

# పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ..



- దరఖాస్తులు సమర్పణకు చివరి తేదీ ఏమీ లేదు...
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

దరఖాస్తులు సమర్పణ కు చివరి తేదీ ఏమీ లేదని, అపోహలు, తప్పుడు వార్తలు నమ్మవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డ్ సభలకు ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీకారం చుట్టగా, బుధవారం ఎల్లారెడ్డి పేట మండలం పదిర ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డులు అర్హులందరికీ అందిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు . అర్హులందరికీ ఆయా పథకాలు అమలు చేస్తామని,గ్రామ సభలలో పెట్టే ప్రాథమిక జాబితా మంజూరు పత్రం కాదు, కేవలం దరఖాస్తుల స్వీకరణ జాబితా మాత్రమేనని స్పష్టం చేశారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకొని వారు అర్జీలు సమర్పించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రామచంద్రం, ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.




# పిల్లలు వాహనం నడిపితే తల్లిదండ్రులకు శిక్ష...

- జిల్లా రవాణా శాఖా అధికారి వి. లక్ష్మణ్

**బలగం టీవీ , ఎల్లారెడపేట**

పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని, పిల్లలు వాహనాలు నడుపుతూ పట్టుపడితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదని జిల్లా రవాణా శాఖా అధికారి వి. లక్ష్మణ్ అన్నారు. జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవం సడక్ సురక్షా అభియాన్-జాగ్రత్త, ను పురస్కరించుకొని బుధవారం ఎల్లారెడ్డిపేట మండలము రాచర్ల బొప్పాపూర్ లో జ్ఞనదీప్ హైస్కూల్ లో విద్యార్థులకి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గాజిల్లా రవాణా శాఖా అధికారి వి. లక్ష్మణ్ హాజరై, మాట్లాడుతూ విద్యార్థులు ఆడే ప్రతీఆటలో నియమనిబంధనలు ఉన్నట్టే, డ్రైవింగ్ చేసేప్పుడు కూడా చాలా నిబంధనలు ఉంటాయని అన్నారు. ,తెలంగాణ ఇనిస్టుట్ అఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ స్కిల్స్ టిఐడిఇస్ ప్రిన్సిపల్ దొరయ్ మురుగన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ఎవరు చేయాలి ఎలా చేయాలి నియమాలు శిక్ష ల గురించి అవగాహన కల్పించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన తర్వాత ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ నందు ట్రైనింగ్ తీసుకో,ని లైసెన్స్ తీసుకోని డ్రైవింగ్ చేయాలని అన్నారు.మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీదర్ మాట్లాడుతూ ,పాఠశాల వాహనాల డ్రైవర్లకు బస్సు నడిపే సమయములో తప్పకుండ సహాయక వ్యక్తి ఆధ్వర్యములో బస్సు నడపాలని, తాగి డ్రైవింగ్ చేయొద్దని మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడుపొద్దని అన్నారు. పిల్లలు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులకు శిక్ష పడుతుందని, పద్దెనిమిది సంవత్సరాలు నిండిన తరువా తనే డ్రైవింగ్ నేర్చుకోవాలని,చదువుకునే సమయం చదువుకోసం మిగతా స్కిల్స్ మీద శ్రద్ద వహించాలన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మినారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు

**బలగం టీవీ, బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశానుసారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల ఎస్సై పృథ్వీధర్ గౌడ్ ఆధ్వర్యంలో కొదురుపాక స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు రోడ్డుపై వెళ్లేటప్పుడు పాటించ వలసిన నియమాల గురించి స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించనుట్కనది. స్కూలు విద్యార్థి విద్యార్థినిలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది స్కూలు యాజమాన్యం పాల్గొన్నారు.

# పథకాల అమలు పట్ల ప్రజలు ఆందోళన పడవద్దు..

- అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- అర్హులైన చివరి లబ్దిదారుడు వరకు సంక్షేమ పథకాల అమలు..
- త్వరలో రేషన్ కార్డుల ద్వారా ప్రతి లబ్దిదారుడికి 6 కిలోల సన్నబియ్యం సరఫరా
- జిల్లా ఇంచార్జ్ ,రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే భూమిలేని కూలీలకు రైతు కూలీల కుటుంబాలకు 12 వేల రూపాయలు ఇస్తున్నాం,రైతు భరోసా కింద రైతులకు అందే సహాయం 20 శాతం పెంచి, ఎకరానికి 12 వేల రూపాయలు అందజేస్తామని, వ్యవసాయ యోగ్యమైన భూమికి పంట వేసిన వేయకుండా రైతు భరోసా అందుతుందని నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిఅన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర నీటి పారుదల , పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, నిరుద్యోగులకు , పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మేలు చేయలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్టం ఏర్పడే నాటికి సుమారు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, గత 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడు ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేవలం 40 వేల కార్డులు మాత్రం అందించారని అన్నారు.


జనవరి 26 నాడు ప్రారంభించి రాష్టంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తు చేసిన, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసినా, గ్రామ సభలలో దరఖాస్తు ఇచ్చిన విచారించి అర్హత మేరకు కార్డులు మంజూరు చేస్తామని అన్నారు.గ్రామ సభలో ప్రకటించే ప్రాథమిక జాబితాలో పేరు లేని పక్షంలో దరఖాస్తు సమర్పిస్తే అర్హతను పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని, ప్రజలు మండల కేంద్రాలు మున్సిపాలిటీలలో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని అన్నారు.

రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం దొడ్డు బియ్యం సరఫరా అవుతున్నాయని, వీటిని చాలా మంది తినడం లేదని, నూతన రేషన్ కార్డుల జారీ తరువాత ప్రతి ఒక్కరికి 6 కీలోల నాణ్యమైన సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తామని అన్నారు. ఉమ్మడి రాష్టం ఉన్న సమయంలో సాచురేషన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించామని, రాష్టంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి ఇక్కడ 100 శాతం అర్హులకు మొదటి దఫా లోనే ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు.

ప్రస్తుతం సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి 5 లక్షల రూపాయలు అందిస్తున్నామని, ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి 6 లక్షల సహాయం అందజేయ బోతున్నామని అన్నారు. ఈ నాలుగు పథకాలను గ్రామసభలు నిర్వహించే ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి జనవరి 26 నుంచి అమలు చేస్తామని, అర్హులైన చివరి వ్యక్తి వరకు లబ్ధి జరుగుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభలలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని అన్నారు . జనవరి 26 నుంచి ప్రారంభించి అర్హత ప్రకారం రేషన్ కార్డులను అందరికీ జారీ చేస్తామని అన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి గ్రామ ప్రజలు తమ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని చేసిన కృషి ఫలితంగా తాను నేడు ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. 43 వేల 100 ఎకరాలకు సాగు నీరు అందించే రుద్రమ్మ ప్రాజెక్టు ను మొదటి ప్రాధాన్యత లో పెట్టామని, ఈ పనులను త్వరలో ప్రారంభం అయ్యేలా చూడాలని అన్నారు . రుద్రంగి మండలం మానాల లో పాత చెరువు కొత్త చెరువుకు లిఫ్ట్ అందించే త్రాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని , మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందించారు. ప్యాకేజీ 9 లో మలక్ పేట్ రిజర్వాయర్ లో టీఎంసి నీళ్లు నింపామని, 25 కోట్లు విడుదల చేస్తే అప్పర్ మానేరు కు నీళ్లు తీసుకుని వెళ్ళవచ్చని , ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. వేములవాడ, తిప్పా పూర్, కథలాపూర్ బస్టాండ్ ఆధునికరణ కు నిధులు మంజూరు చేయాలని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103 , రైతు భరోసా క్రింద 1927 , నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామని అన్నారు.అనంతరం మంత్రులు కలికోట - సూరమ్మ ప్రాజెక్ట్లి పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, ప్రాజెక్ట్ పరిధిలోని భూములకు సాగునీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇతర పనులకు అన్ని నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం..

- తహసీల్దార్ జయంత్

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన వారికి అందించాలని ఉద్దేశంతో మండేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు,పథకాలను వాటి గురించి వివరిస్తూ ఆయా పథకాలు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ప్రకటించి అర్హులకు పథకాలు అందేలా చూస్తామని ఎమ్మార్వో జయంత్ తెలిపారు. జాబితాలో పేర్లు లేని వారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు




అందేలా చూస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన పెద్ది లత అనే మహిళ తనకు వ్యవసాయ భూమి లేదని ఇల్లు కూడా లేదని ఎమ్మార్వో ను వేడుకోవడంతో అక్కడే ఉన్నా స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు సైతం సరైన అర్హూలు అని చెప్పడంతో తప్పకుండా ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు గతంలోని 377 సర్వే నంబర్ గల భూమిలో గ్రామానికి చెందిన 336 ఎకరాల భూమి కో లో ప్ ం ం ం న బా ధి. తు ం ల క ం నష్టపరిహారం వచ్చేలా చేయాలని గత ప్రభుత్వం బాధితుల కోసం ఒక్కొక్కరికి రెండు గంటల స్థలం కేటాయిస్తామని తెలిపిన వారికోసం ఏర్పాటు చేసిన 15 ఎకరాల స్థలాన్ని ఇతరులకు కేటాయించవద్దని ఈ సందర్భంగా వేడుకున్నారు.

# అభిషేక్ అదరహో...

**13 ఓవర్ లలో టార్గెట్ ఛేజ్ చేసిన భారత్** | **తొలి టీ 20లో భారత్ ఘన విజయం**



**బలగం టీవి, కోల్‌కతా**

అభిషేక్ శర్మ (79 పరుగులు) సూపర్ హాఫ్ సెంచరీతో అదరగొట్టడంతో కోల్‌కాతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ ఘన విజయం సాధించింది. ఇంగ్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో భారత్ గెలుపొందింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 133 పరుగుల టార్గెట్‌ను 12.5 ఓవర్లలోనే టీమిండియా ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో భారత్ నిలిచింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ 79టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

తొలి టీ20లో భారత బౌలర్లు నిప్పులు చెరిగారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. భారత బౌలర్ల దాటికి కేవలం 132 పరుగులకే ఆలౌటైంది. తొలి ఓవర్‌లోనే విధ్వంసకర ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ను ఔట్ చేసి అర్ష్‌దీప్ సింగ్ భారత్‌కు అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు.ఆ తర్వాత మళ్లీ మూడో ఓవర్‌లో బెన్ డకెట్‌ను అర్ష్‌దీప్ పెవిలియన్‌కు పంపాడు. అనంతరం స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఒకే ఓవర్‌లో హ్యారీ బ్రూక్, లివింగ్ స్టోన్‌ను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను దెబ్బతీశాడు. అయితే ఓ వైపు వికెట్లు పడుతున్నప్పటికి కెప్టెన్ జోస్ బట్లర్ మాత్రం అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. 44 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా తలా రెండు వికెట్లు సాధించారు.

అనంతరం బ్యాటంగ్‌కు దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ, సంజు శుభారంభం చేశారు. తొలి వికెట్ కు 41 పరుగులు జోడించారు. 26 పరుగులు చేసిన సంజు ఔట్ కాగా, సూర్య కుమార్ యాదవ్ సున్నా పరుగులకు వెనుదిరిగాడు.ఇక అభిషేక్ 79 పరుగులు చేశాడు. తిలక్ వర్మ 19, హార్దిక్ 3 పరుగులతో నాటౌట్ గా నిలిచారు.






## 'ఛావా' ట్రైలర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రెస్టీజీయస్ ప్రాజెక్ట్ ఛావా . నటుడు విక్కీ కౌశల్‌టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తుండగా.. మడాక్ ఫిల్మ్స్ పతాకం పై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ పెద్ద కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రాబోతుండగా.. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా వాలంటైన్స్ డే కానుకగా.. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.


### తమిళ యాక్టర్లపై
## గౌతమ్ మీనన్ సంచలన ఆరోపణలు

**బలగం టీవి, హైదరాబాద్**



డైరెక్టర్ గౌతమ్ మీనన్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన తాజాగా మలయాళ చిత్రం డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్ చేస్తున్నారు. మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ మూవీ జనవరి 23న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. "నిజం చెప్పాలంటే సినిమాలకు భారీ బడ్జెట్ అవసరం లేదు. మంచి కంటెంట్ అనేది పరిగణలోకి వస్తుంది. రూ.100 కోట్ల సినిమాలు తెరకెక్కించేందుకు బదులు రూ.10 కోట్ల బడ్జెట్‌తో పది సినిమాలు నిర్మించడంపై ఫోకస్ పెట్టాలి. చాలా మంది తమిళ యాక్టర్లు స్క్రిప్ట్‌తో సంబంధం లేకుండా హై బడ్జెట్ సినిమాలపై పనిచేసేందుకు ఇష్టపడుతుంటారు. నాకొక అవకాశం ఇస్తే.. కథలతో మొదలు.. ప్రతీ విషయాన్ని మాలీవుడ్‌కు తీసుకొస్తా. ఆ కథల్లో సగానికిపైగా సినిమాలు తమిళంలో తెరకెక్కించబడవు. ఒక సినిమా మలయాళంలో సక్సెస్ అయితే దాన్ని కోలీవుడ్‌లో రీమేక్ చేస్తారు. కానీ తమిళ యాక్టర్లు మాత్రం అలాంటి ఒరిజినల్ స్క్రిప్ట్‌ను చేసేందుకు ఎప్పుడూ ఒకే చెప్పరు. ఈ ప్రకటన తర్వాత నేను తమిళ సినిమాల్లో పనిచేయలేకపోవచ్చు" అని కోలీవుడ్‌లో ఉన్న పరిస్థితుల గురించి చెప్పుకొచ్చాడు.

## నాగశౌర్య బ్యాడ్ బాయ్ కార్తిక్




**బలగం టీవి, హైదరాబాద్**

నాగశౌర్య కొత్త దర్శకుడు రామ్ దేశిన డైరెక్షన్‌లో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే బుధవారం నాగశౌర్య బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రానికి 'బ్యాడ్ బాయ్ కార్తిక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా విభిన్నమైన కథతో దీనిని తెరకెక్కిస్తున్నారు. శౌర్య యాంగ్రీ లుక్‌లో కనిపించారు. ఇప్పటికే అరవైశాతం చిత్రీకరణ పూర్తయిందని, హై ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని, నాగశౌర్య పాత్ర గతంలో చూడని విధంగా పవర్‌ఫుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

### సంక్రాంతికి వస్తున్నాం
## విక్టరీ నా కెరీర్ లో ఓ హిస్టరీ

**బలగం టీవి, హైదరాబాద్**

"సంక్రాంతికి వస్తున్నాం' విక్టరీ నా కెరీర్ లో ఓ హిస్టరీ' అన్నారు బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి. దర్శకుడిగా ఆయన జర్నీకి జనవరి 23తో పదేళ్ళు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. " ఈ పదేళ్ళలో చేసిన ప్రతి సినిమా ఒక ఎక్స్‌పీరియన్స్. నేను ఏ జోనర్ సినిమా చేసినా ఆడియన్స్ గొప్పగా సపోర్ట్ చేశారు. ప్రతి సినిమాకి ఒకొక్క మెట్టు ఎక్కిస్తూ ఫైనల్ గా ఈ పొంగల్ కి 'సంక్రాంతికి వస్తున్నాం'తో అద్భుతమైన విజయం ఇచ్చారు. ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ క్రెడిట్ అంతా ఆడియన్స్ కే ఇస్తాను. 'సంక్రాంతికి వస్తున్నాం' మామూలు సక్సెస్ కాదు. ఆరు రోజుల్లో వందకోట్ల షేర్, వన్ వీక్ లో 200 కోట్లు క్రాస్ చేయడం అంటే ఓ అద్భుతం. ఇది నా కెరీర్ లో హిస్టరీ. ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ కి ఈ బలం వుందని ఆడియన్స్ చాలా స్ట్రాంగ్ గా స్టేట్మెంట్ ఇచ్చారని అనిపిస్తోంది. సంక్రాంతికి వస్తు న్నాంతో నా ఆస్తి విలువేంటో ఆడియన్స్ మళ్ళీ చూపించారు. ఆడియన్స్ ప్రేమ పరంగా నేను మల్టీ మిలీనియర్‌ని.ఎఫ్ 2 లాంటి మంచి ఎంటర్ టైనర్ తీద్దామని అనుకున్నాను. ఇది మా అంచనాలుకు మించి ఆడుతోంది. ఫైనల్ నెంబర్ కూడా అందరూ సర్ ప్రైజ్ అయ్యే నెంబర్ ఉండబోతోంది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా విజయం ఓ వండర్. ఓ కేస్ స్టడీ. ఈ సినిమా ఎందుకు ఇంతపెద్ద హిట్ అయ్యిందో నేను కేస్ స్టడీగా పెట్టుకోవాలి. మేమంతా సక్సెస్ ని ఎంజాయ్ చేస్తున్నాం. పదేళ్ళలో ఎలాంటి మార్పు లేదండి. ఇంతకు ముందు ప్రతిదానికి రియాక్ట్ అయ్యేవాడిని. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను. వర్క్ పైనే ఫోకస్ చేస్తాను. ప్రతి శుక్రవారం వచ్చే సినిమాలు చూస్తాను. నేర్చుకోవాల్సిన విషయాలు వుంటే నేర్చుకుంటాను. జంధ్యాల గారి సినిమాలు నాకు చాలా ఇష్టం. హైహై నాయక లో ఒక సౌండ్ ఎఫెక్ట్ తో అది వస్తుంది. ఇప్పుడు ఓటీటీ నేపథ్యంలో బుల్లిరాజు పాత్రని డిజైన్ చేశాను. ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు.ఈవివి గారు ఓ లెజెండ్. ఆయన సినిమాలు చిన్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఆయనతో పోల్చడం బిగ్గెస్ట్ కాంప్లిమెంట్, బిగ్గెస్ట్ రెస్పాన్సిబిలిటీ" అని అన్నారు.




## తెలుగులో 'మద గజ రాజా' ...

**బలగం టీవి, హైదరాబాద్**

విశాల్ ఇటీవల 'మద గజ రాజా' చిత్రంతో సంచలన విజయం సాధించారు. సుందర్.సి దర్శకత్వంలో జెమినీ ఫిలిం సర్క్యూట్ నిర్మాణంలో సంక్రాంతి సందర్భంగా తమిళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. అంతేకాదు రూ.50 కోట్లకు పైగా వసూలు చేసి, సంక్రాంతికి విడుదలైన తమిళ సినిమాలన్నింటిలో నెంబర్ వన్ చిత్రంగా రికార్డ్ సృష్టించింది. ఇప్పటికీ భారీ వసూళ్లతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో ఈనెల 31న సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. 'యాక్షన్ కామెడీ జోనర్‌లో రూపొందిన 'మద గజ రాజా' తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే ఎంటర్‌టైనర్. హీరో విశాల్ తన పవర్ ప్యాక్డ్ యాక్షన్‌తో అదరగొట్టారు. సంతానం కామెడీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. డైరెక్టర్ సుందర్.సి అన్ని కమర్షి యల్ ఎలిమెంట్స్‌తో హోల్సమ్ ఎంటర్‌టైన్మెంట్ అందించారు. విజయ్ ఆంటోని పాటలన్నీ ప్రేక్షకులను అలరిస్తాయి. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా అద్భుతంగా అలరిస్తుందని మేకర్స్ తెలియజేశారు.